క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్: మండలంలోని పలువురు లబ్దిదారులకు ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ శనివారం సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. పిల్లోనిగూడకు చెందిన పి.వెంకటేష్, చౌదరిగూడకు చెందిన బక్క రాజుకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జయమ్మ, సర్పంచ్‌లు బుచ్చమ్మ, రాజ్‌కుమార్, ఉప సర్పంచ్ కృష్ణ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు జుర్కి రమేష్, కె.నర్సింహ, శ్రీకాంత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యంగా గోడ కూల్చారని ఫిర్యాదు

శంషాబాద్: దౌర్జన్యంగా గోడను కూల్చారంటూ ఓ వ్యక్తి ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని సర్వే నంబరు 50లో ఘన్‌శ్యామ్‌పటేల్‌కు చెందిన 8 ఎకరాల భూమి ఉంది. దీని పక్కనే ఉన్న సర్వే నంబరు 51లోని భూమి యజమాని తన అనుచరులతో కలిసి తమ భూమిని ఘన్‌శ్యామ్‌పటేల్ భూముల్లో కలిపేసుకున్నాడనే ఆరోపణలతో గోడను కూల్చివేశారు. దీనిపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నానక్‌రాంగూడ ప్రధాన ప్రాంతం



నానక్‌రాంగూడలోని ప్రధాన రోడ్డు పరిస్థితి

అభివృద్ధి ఫలాలు కొందరికే..

- తీరని సమస్యలు.. పరిహారం అందక రైతుల ఇబ్బందులు
- ఇదీ 'నానక్‌రాంగూడ' పరిస్థితి

రాయదుర్గం: పచ్చని పొలాలు..చెరువులు.. పచ్చదనంతో ఒకప్పుడు నానక్‌రాంగూడ కళకళలాడేది. నేడు గ్రామీణ ప్రాంతరూపులే లేకుండాపోయాయి. మెట్రోసిటీని మరిపిస్తోంది. జాతీయ, అంతర్జాతీయ సంస్థల రాకతో ఆకాశహర్మ్యాలను తలపించే భవనాలు వచ్చాయి. ఇక త్వరలో నానక్‌రాంగూడకు మెట్రో రైలు సైతం రానుంది. రాయదుర్గం మెట్రోస్టేషన్ నుంచి నానక్‌రాంగూడ మీదుగా శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లేలా చర్యలు చేపడుతున్నారు. చుట్టూరా ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఉన్నా అభివృద్ధి లేదనే విమర్శ స్థానికుల నుంచి వినిపిస్తోంది. గతంలో ప్రభుత్వం ఇక్కడి భూములను ఐటీ సంస్థలకు ఇవ్వడంతో బహుళ అంతస్తులు వెలిశాయి. అయితే నానక్‌రాంగూడ మాత్రం అభివృద్ధి చెందలేదని అంటున్నారు.

- స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలి.
- బస్తీ దవాఖానా, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు.
- పూర్తిస్థాయి భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ నిర్మించాలి.
- మేడికుంట చెరువును అభివృద్ధి చేయాలి.
- ఆర్టీసీ బస్సులను మెహిదీపట్నం, కోఠి, సికింద్రాబాద్ ప్రాంతాలకు నానక్‌రాంగూడ మీదుగా ఐటీ కారిడార్‌కు నడపాలని స్థానికుల డిమాండ్.



నానక్‌రాంగూడకు చెందిన మేడికుంట నీటి పరిస్థితి



నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని విప్రో సర్కిల్



నానక్‌రాంగూడలో అనాధిగా ప్రధాన రోడ్డుపైనే ప్రతి ఆదివారం సంత నిర్వహిస్తున్న దృశ్యం

భూబాధితులకు న్యాయం చేయాలి



నానక్‌రాంగూడ పట్టా భూములను తీసుకొని ఇప్పటి వరకు నష్టపరిహారం ఇవ్వలేదు. మాకు న్యాయం చేయాలి. స్థానికంగా సౌకర్యాలను మెరుగుపర్చాలి. చుట్టూరా అద్దాల మేడలు, రోడ్లు, బస్సు సౌకర్యాలను కల్పించారు. అయితే నానక్‌రాంగూడకు బస్సులను తగ్గించారు. ఐటీకారిడార్ తరహాలో అభివృద్ధి చేయాలి

–జి. ముత్యంరెడ్డి, నానక్‌రాంగూడ

మౌలిక వసతులు కల్పించాలి



నెలకు రూ.450 తీసుకుంటున్నా నీళ్లు చాలడంలేదు. నీటి సరఫరాను మెరుగు పర్చాలి. టీఎస్ఐఐసీ నానక్‌రాంగూడను దత్తత తీసుకోవాలి. మేడికుంటను సుందరీకరించాలి. ఇక్కడ భూములను కోల్పోయిన రైతులందరికీ న్యాయం చేయాలి

–రమేష్‌గౌడ్, నానక్‌రాంగూడ

పారిశుద్ధ్య కార్మికులకు సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

బండ్లగూడ: ప్రజలు తమ ఆరోగ్యం పట్ల నిత్యం జాగ్రత్తలు తీసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. పారిశుద్ధ్యం–ప్రజారోగ్యంపై అంశంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎవరైనా సొమ్మసిల్లి పడిపోయినప్పుడు వారికి సీపీఆర్ ఎలా చేయాలనే దానిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజు రోజుకు కార్డియాక్ అరెస్ట్ కేసులు పెరిగిపోతున్నాయన్నారు. ప్రజలు పౌష్టికాహారంతో కూడిన భోజనం తీసుకోవాలని, ప్రతిరోజూ వాకింగ్, వ్యాయామం, యోగా వంటివి చేయాలన్నారు. మనసు ప్రశాంతంగా ఉంచుకొని జీవించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.నరేష్, కార్మికులు మల్లేష్, వెంకటేష్, సుభాష్, గిరినాథ్, జగన్‌మోహన్ పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించినప్పుడే సాంకేతికతకు విలువ

రాయదుర్గం: సమస్యను పరిష్కరించినప్పుడే సాంకేతికతకు విలువ ఉంటుందని కలారి క్యాపిటల్ భాగస్వామి రవీందర్‌సింగ్ అన్నారు. శుక్రవారం రాత్రి గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (సీఐఈ) ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ 42 సమ్మిట్ నిర్వహించారు. 150కిపైగా స్టార్టప్‌లు, కార్పొరేట్ ఇంక్యుబేటర్లు ఒకేచోట చేరారు. ట్రిపుల్‌ఐటీ ప్రొఫెసర్ రమేష్‌లోకనాథన్ మాట్లాడుతూ.. నగరంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ చుట్టూ చాలా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో యువ పారిశ్రామికవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. అలాగే హోలీ వేడుకలను సైతం నిర్వహించనున్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

'పే రివిజన్-2022 అమలు చేయాలి'

గోల్కొండ: ఏప్రిల్ 2022 నుంచి సవరించిన వేతనాలను చెల్లించడంతో పాటు ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చడం తదితర పెండింగ్‌లో ఉన్న న్యాయమైన తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని విద్యుత్ సైబర్ సిటీ సర్కిల్ రాజేంద్రనగర్ సర్కిల్ యూనియన్ నాయకులు లక్ష్మీనారాయణగౌడ్, సయ్యద్ సుజాత్ హుస్సేన్ డిమాండ్ చేశారు. పే రివిజన్ అమలు కోసం శనివారం నానల్‌నగర్‌లోని సైబర్ సిటీ, రాజేంద్రనగర్ సర్కిళ్ల విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టీఎస్‌పీఈ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో అన్ని శాఖల విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

'మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం'

బండ్లగూడ: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను గాలికొదిలేసిందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ నిరుడు శేఖర్‌ముదిరాజ్ అన్నారు. శనివారం కిస్మత్‌పూర్‌లోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలోని ప్రజలు కోట్లాది రూపాయల పన్నులు చెల్లిస్తున్నా వారికి మౌలిక వసతులు కల్పించడంతో విఫలమవుతున్నారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

సరస్వతి విద్యాపీఠం వార్షికోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: విద్యారణ్య ఆవాస విద్యాలయం సరస్వతి విద్యాపీఠం 39వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నేడు కుస్తీ పోటీల ముగింపు

చార్మినార్: కొత్వాల్ కేసరి కుస్తీ చాంపియన్‌షిప్ ముగింపు కార్యక్రమం ఆదివారం సాయంత్రం జరగనుందని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య తెలిపారు. ఈ మేరకు శనివారం కుడా స్టేడియంలో జరుగుతున్న కుస్తీ పోటీల రెండో రోజు కార్యక్రమానికి ఆయన హాజరై పోటీల్లోని వస్తాదులకు కరచాలనం చేసి బెస్ట్ ఆఫ్ లక్ చెప్పారు. కొద్దిసేపు వస్తాదుల కుస్తీ పోటీలను తిలకించిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆదివారం సాయంత్రం 7 గంటలకు కుస్తీ పోటీల ముగింపు కార్యక్రమం ఉంటుందని.. నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్‌తో పాటు పలువురు ఐపీఎస్ అధికారులు పాల్గొంటారన్నారు. వివిధ కేటగిరిలలో విజయం సాధించిన విజేతలతో పాటు టైటిల్ విన్నర్‌కు కమిషనర్ చేతుల మీదుగా నగదు బహుమతి, మెడల్, సర్టిఫికెట్‌ను అందజేయనున్నామన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన



లంగర్‌హౌజ్: విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని లంగర్‌హౌజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అన్నారు. హెచ్ఐఎంఎస్‌డబ్ల్యూ ఖైరతాబాద్ జోన్ హెడ్ ప్రశాంత్ మిశ్రా సారథ్యంలో హెచ్ఐఎంఎస్‌డబ్ల్యూ కార్వాన్ సర్కిల్–13 ఇన్‌చార్జి మురళీ చక్రవర్తి, లంగర్‌హౌజ్ వార్డు ఫీల్డ్ అసిస్టెంట్ ముత్యాల నరేష్ ఆధ్వర్యంలో లంగర్‌హౌజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ ఇంటితో పాటు చుట్టు పక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎస్ఎఫ్ఏలు కార్తీక్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మెడికో ప్రీతికి నివాళి

గోల్కొండ: రాష్ట్రంలో ప్రతిరోజూ అమాయక విద్యార్థులు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా బలవుతున్నారని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. సైఫ్ వేధింపులకు ప్రాణాలు కోల్పోయిన మెడికో ప్రీతికి బీజేపీ ఆధ్వర్యంలో శనివారం గుడిమల్కాపూర్ వద్ద క్యాండిళ్లతో పీస్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నో కళాశాలలో యాజమాన్య వేధింపులను తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. అంతేకాకుండా ర్యాగింగ్ విచ్చలవిడిగా జరుగుతుందని, ర్యాగింగ్ బాధితులు కూడా వేధింపులను భరించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ప్రీతి చిత్రపటంతో క్యాండిల్ ర్యాలీ గుడిమల్కాపూర్‌లోని వీధుల్లో కొనసాగింది.

కిషన్‌రెడ్డి చొరవతో ఎలివేటెట్ బ్రిడ్జి పొడిగింపు

శంషాబాద్: కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఎలివేటెడ్ బ్రిడ్జి పొడిగింపు అంశంలో కదలిక వచ్చిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యుడు డాక్టర్ ప్రేమ్‌రాజ్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకంతో బ్రిడ్జిని 16వ కిలోమీటరు వద్ద ప్రారంభించాల్సిన ఉండగా కాంట్రాక్టర్‌లకు లబ్ధిచేకూరే విధంగా 17 కిలోమీటరు వద్ద రద్దీ ప్రాంతంలో ప్రారంభించారన్నారు. రహదారి విస్తరణలో ఓ వర్గానికి చెందిన ప్రార్థన మందిరానికి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసినా నేటికీ రెండింటిని వినియోగిస్తున్న కారణంగానే ఇబ్బందులు తలెత్తాయన్నారు. సమస్యను పరిష్కరించకుండా కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూర్చేందుకు డిజైన్ మార్చారని ఆరోపించారు. ఇటీవల కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దీనిపై అధ్యయనం చేయించి బ్రిడ్జి నిర్మాణం పొడిగించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మణికొండ: గుర్తుతెలియని వ్యక్తి తలకు గాయాలై మృతి చెందిన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ బాలరాజు తెలిపిన వివరాల మేరకు.. 45 నుంచి 50 సంవత్సరాల వయసున్న ఓ వ్యక్తి ఔటర్ రింగ్ రోడ్డు నార్సింగి ఎగ్జిట్ వద్ద మృతి చెంది పడిఉన్నాడు. అతడి వద్ద హయత్‌నగర్ అడ్డాలో లేబర్ పనిచేసే కార్డు ఉందన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, అతని తరఫు వారు ఎవరు ఉన్నా నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

టోలిచౌకి వద్ద ట్రాఫిక్ స్పెషల్ డ్రైవ్

గోల్కొండ: అక్రమ పార్కింగ్‌లను ఏ మాత్రం సహించేది లేదని టోలిచౌకి ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ విష్ణు వర్ధన్ అన్నారు. శనివారం ఆయన తన సిబ్బందితో టోలిచౌకి చౌరస్తా, దాని పరిసరాలలో అక్రమ పార్కింగ్‌లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కొంత కాలం క్రితం టోలిచౌకి రుమాన్ హోటల్, రహమత్ హోటల్‌లతో పాటు టోలిచౌకి ఫ్లై ఓవర్ కింది భాగంలో వాహనాల అక్రమ పార్కింగ్‌ను పూర్తిగా నిషేధించారు. దీని కారణంగా దర్గా, గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు రుమాన్ హోటల్ ముందుగా మెహిదీపట్నం వైపునకు వెళ్లాయి. అయితే కొన్ని రోజుల నుంచి మళ్లీ రుమాన్ హోటల్ ముందు అక్రమ పార్కింగ్ మళ్లీ మొదలైంది. దీనిపై ఫిర్యాదులు రావడంతో ఆయన తన సిబ్బందితో కలిసి అక్రమంగా పార్కింగ్ చేసి ఉన్న వాహనాలను స్వాధీనం చేసుకుని గోషామహల్‌కు తరలించారు.



సుస్థిర వ్యవసాయం–మెరుగైన పద్ధతులపై సెమినార్



సెమినార్‌లో పాల్గొన్న అధికారులు

ఏజీవర్సిటీ: జీ20 సమావేశాలను పురస్కరించుకొని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా సుస్థిర వ్యవసాయానికి మెరుగైన పద్ధతులు అనే అంశంపై శనివారం విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ మాజీ పరిశోధన సంచాలకుడు జగదీశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. భూమిలో కార్బన్ శాతం గణనీయంగా తగ్గిపోయిందని, రైతులు పూర్తిగా రసాయన ఎరువుల మీద ఆధారపడడంతో పాటు ఎక్కువ మోతాదులో వినియోగిస్తున్నారని చెప్పారు. రైతులకు ఇది చక్కని అవకాశమని, ఈ అంశంపై ఏమైనా సందేహాలుంటే శాస్త్రవేత్తలతో నివృత్తి చేసుకోవాలని సూచించారు. నేల ఆరోగ్యం కాపాడుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని, అన్ని వనరులను సద్వినియోగం చేసుకున్నప్పుడే నేల నుంచి మంచి ఉత్పత్తులను పొందగలమని, లేనిపక్షంలో మున్ముందు ఆహార కొరత ఏర్పడే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ అధికారులు జీ20 ఏర్పాట్ల గురించి విపులంగా వివరిస్తూ దాని నేపథ్యం వసుధైక కుటుంబం అని తెలిపారు. జీ20 ప్రతినిధుల సభకు భారతదేశం డిసెంబర్ 2022 నుంచి 2023 నవంబర్ వరకు ప్రతినిధిగా ఉంటుందన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తాం



సమావేశంలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్ తదితరులు

బండ్లగూడ: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ అన్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అసెంబ్లీ నియోజకవర్గాల బ్లాక్ అధ్యక్షులు, మండల అధ్యక్షుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో చెన్నారెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండ్లగూడలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చే ప్రతి పిలుపును రాజేంద్రనగర్ నియోజకవర్గంలో విజయవంతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్తను కలుపుకొని పనిచేసి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బాధ్యతగా పని చేస్తామని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

22 నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు



ఉత్సవాల ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ, భాగ్యలక్ష్మి కాలనీ కనకదుర్గామాత దేవాలయంలో ఈనెల 22 నుంచి 30 వరకు నిర్వహించే వసంత నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లారెడ్డి కోరారు. ఉత్సవాల ఆహ్వానపత్రికలను శనివారం దేవాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సంవత్సరం వసంత నవరాత్రి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. 9 రోజుల పాటు తమ గోత్రనామాలతో అర్చన చేయించుకునే భక్తులు ఆలయంలో రూ.301 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ కార్యదర్శి యాదగిరి, కోశాధికారి ఎల్లయ్య, కమిటీ సభ్యులు బాల్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

జియాగూడ: వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికి తీస్తాయని కార్పొరేటర్ బోయిని దర్శన్ అన్నారు. శనివారం జియాగూడలోని సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్‌లో స్కూల్ డైరెక్టర్ బాల్‌రాజ్ కౌలే, ప్రిన్సిపాల్ సునేత్ర ఆధ్వర్యంలో వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటైంది. ఈ ప్రదర్శనలో కేజీ నుంచి 10వ తరగతి వరకు గల విద్యార్థులు వివిధ పాఠ్యాంశాల నుంచి సేకరించిన విషయాలతో వైజ్ఞానిక ప్రదర్శన చేపట్టారు. నర్సింగ్ రావు, ఠాకూర్ రఘునందన్ సింగ్ పాల్గొన్నారు.